సాక్షి నిర్మల్

గురువారం । 28 । మార్చి । 2024

రూ.4లక్షల నగదు స్వాధీనం



కడెం: బెల్లాల్ ఎక్స్ రోడ్డు సమీపంలో ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి బుధవారం వాహనాల తనిఖీలు చేపట్టారు. మాసాయిపేట్ గ్రామానికి చెందిన ఎఫ్‌జీవో దాసరి తిరుపతి నుంచి రూ.4లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు.



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
గురు : 6:30	శుక్ర: 4:51

వాతావరణం

గరిష్టం/కనిష్టం
39.0 /28.0

ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. మధ్యాహ్నం ఉక్కగా ఉంటుంది. ఉదయం, సాయంత్రం ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది.

న్యూస్‌రీల్

సోన్ పోలీస్‌స్టేషన్ తనిఖీ



గౌరవవందనం స్వీకరిస్తున్న ఎస్పీ

సోన్: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను బుధవారం ఎస్పీ డాక్టర్ జానకి షర్మిల ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్‌కు మొదటిసారి వచ్చిన ఆమెకు పోలీసులు గౌరవవందనం చేశారు. అనంతరం ఎస్పీ రికార్డులు పరిశీలించారు. పెండింగ్ కేసుల వివరాలు ఎస్సై రవీందర్‌ను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ పరిసరాలు పరిశీలించి సంతృప్తి వ్యక్తంజేశారు. లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు.

బాధ్యులపై చర్య తీసుకోవాలి

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ జానకి షర్మిలను జిల్లా మున్నూరు కాపు ఉద్యోగ సంక్షేమ సంఘం సభ్యులు బుధవారం కలిశారు. కడెం ప్రాజెక్ట్ ఇరిగేషన్ శాఖలో టెక్నికల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న తోకల రాకేశ్ ఆత్మహత్యకు ఉన్నతాధికారుల వేధింపులే కారణమని ఆరోపించారు. వారిపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. బాధితుడి కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.

'అడెల్లి' హుండీల లెక్కింపు



హుండీల డబ్బులు లెక్కిస్తున్న భక్తులు

సారంగాపూర్: అడెల్లి మహాపోచమ్మ అమ్మవారికి భక్తులు హుండీలో సమర్పించిన నగదు, కానుకలను బుధవారం ఆలయ ఈవో రవికిషన్‌గౌడ్, దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ రాజమొగిలి ఆధ్వర్యంలో లెక్కించారు. రూ.28.33లక్షల నగదు, 178 గ్రాముల మిశ్రమ బంగారం, 3కిలోల 430 గ్రాముల మిశ్రమ వెండి సమకూరినట్లు పేర్కొన్నారు. గత ఆదాయం కంటే అధికంగా వచ్చినట్లు తెలిపారు. జెడ్పీటీసీ సభ్యుల ఫోరం జిల్లా అధ్యక్షుడు పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దశరథ రాజేశ్వర్ లెక్కింపును పరిశీలించారు. సీనియర్ అసిస్టెంట్ రమణారావు, ఏఎస్సై వసంత్, ఎస్బీఐ మేనేజర్ ప్రశాంత్, బ్యాంక్ కోశాధికారి రాకేశ్, వీడీసీ అధ్యక్షుడు శేఖర్‌గౌడ్ తదితరులున్నారు.

'ఆర్టీసీ బస్సు నాలుగు ట్రిప్పులు నడిపించాల్సిందే'

సారంగాపూర్: మండలంలోని మలక్‌చించోలి గ్రామానికి ఆర్టీసీ బస్సు రెండు ట్రిప్పులే వేయగా గ్రామానికి చెందిన మహిళలు బస్సును అడ్డుకుని ఆందోళన చేసిన సంగతి తెలిసిందే. గ్రామస్తుల కోరిక మేరకు డీఎం ప్రతిమారెడ్డి గ్రామానికి నాలుగు ట్రిప్పులు బస్సు వేశారు. కాగా, గ్రామం నుంచి బస్సులు ఖాళీగా వస్తుండగా పరిస్థితి గమనించేందుకు బుధవారం సూపర్‌వైజర్ నర్సయ్య గ్రామానికి వచ్చారు. గ్రామసభ నిర్వహించి ప్రజలకు ఆర్టీసీ సేవలపై అవగాహన కల్పించారు. గ్రామస్తుల కోరిక మేరకు నాలుగు ట్రిప్పులు బస్సు వేస్తే ప్రైవేట్ వాహనాల్లో వెళ్లడం దారుణమన్నారు. ఇలా చేస్తే రెండు ట్రిప్పులే నడుపుతామని చెప్పారు. దీంతో గ్రామస్తులు ప్రైవేట్ వాహనాల్లో వెళ్లే వారిని గుర్తించి జరిమానా విధిస్తామని, నాలుగు ట్రిప్పులు కొనసాగించాలని కోరారు. సూపర్‌వైజర్ ఈ విషయాన్ని డీఎం దృష్టికి తీసుకెళ్లగా నాలుగు ట్రిప్పులు కొనసాగిస్తామని తెలిపారు. మాజీ సర్పంచ్ కొట్టాల చిన్నమ్మ, పోసవ్వ, వీడీసీ సభ్యులు, గ్రామస్తులున్నారు.

నీటి ఎద్దడి రానివ్వొద్దు

ఖానాపూర్: గ్రామీణ ప్రాంతాల్లో నీటి ఎద్దడి రానివ్వొద్దని జెడ్పీ సీఈవో గోవింద్ సూచించారు. బుధవారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఖానాపూర్, కడెం, పెంబి, దస్తూరాబాద్ మండలాలకు చెందిన అధికారులతో సమీక్ష నిర్వహించారు. మిషన్ భగీరథ నీటితో పాటు ఇతర ఓవర్‌హెడ్ వాటర్‌ట్యాంకుల ద్వారా నీరందేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఎక్కడైనా సమస్యలుంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. మిషన్‌భగీరథ ఈఈ సందీప్, డీపీవో శ్రీనివాస్, డీఎల్పీవో రమేశ్, ఎంపీడీవో సునీత, ఎంపీవో చంద్రశేఖర్, ఆయా మండలాల అధికారులున్నారు.

సిరాలపై ఆశలు



భారీ వర్షాలతో తెగిపోయిన సిరాల ప్రాజెక్టు

- ఏడాది క్రితం కొట్టుకుపోయిన కట్ట
- నష్టపోయిన ఆయకట్టు రైతాంగం
- ఇప్పటికే వట్టిపోతున్న బోరుబావులు
- పునర్నిర్మాణానికి సర్కారు గ్రీన్‌సిగ్నల్
- హర్షం వ్యక్తంజేస్తున్న అన్నదాతలు

భైంసా/భైంసారూరల్: సిరాల ప్రాజెక్ట్ పునర్నిర్మాణానికి రూ.12.37కోట్ల నిధుల మంజూరుకు ఆర్థిక శాఖ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీంతో ఆయకట్టు రైతుల ఆశలు పెరుగుతున్నాయి. గతేడాది కురిసిన భారీ వర్షాలకు ప్రాజెక్ట్ కట్ట తెగింది. ప్రధానకట్ట కొట్టుకుపోయి వందలాది ఎకరాల్లో పంటలు నీటమునిగాయి. నీటి ప్రవాహానికి దిగువనున్న ఇలేగాం చెరువు తెగింది. దీని కింది వందలాది ఎకరాల్లో బండరాళ్లు, ఇసుకమేటలు వేశాయి. సాగుభూముల హద్దులు చెరిగి బండరాళ్లు, ఇసుకమేటలతో గుర్తు పట్టలేనంతగా మారిపోయాయి.

1,800 ఎకరాలకే పరిమితం..

140 ఏళ్ల క్రితమే నైజాం కాలంలో ఈ ప్రాజెక్ట్ నిర్మించారు. దీని కింద అప్పట్లో నాలుగువేల ఎకరాలకు సాగునీరు అందేది. సిరాల, ఇలేగాం, దేగాం, మచ్కల్, ముద్గల్, వాలేగాం, కుంసర గ్రామాల వరకు నీరు వెళ్లేది. ప్రాజెక్ట్‌లో పూడిక పేరుకుపోవడంతో ఆయకట్టు 1,800 ఎకరాలకే పరిమితమై సిరాల, ఇలేగాం, దేగాం గ్రామాల రైతులకే సాగునీరు అందింది. ఈ ప్రాజెక్ట్ కింద ప్రధానంగా వరి, మక్క, పత్తి తదితర పంటలు సాగుచేస్తారు. ఎన్నో ఏళ్లుగా ప్రాజెక్ట్‌ను నమ్ముకుని సాగుచేసుకునే రైతులు కట్ట తెగిపోగా తీవ్రంగా నష్టపోయారు. ఇసుక మేటలు, రాళ్లతో నిండిన భూములు చదును చేసుకోలేకపోయారు. ఏడాదిగా సాగుకు దూరమయ్యారు.

రెండునెలల్లో పనులు పూర్తయితేనే..

ఈ ఏడాది ప్రాజెక్ట్ మరమ్మతు పనులు ప్రారంభిస్తారని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. రెండు నెలల్లో పనులు పూర్తయితేనే నీరు నిధానంగా అలుగు నుంచి బయటకు వెళ్తుంది. నిర్మాణ పనులు చేపట్టకపోతే తెగిన కట్ట ప్రాంతం నుంచి నేరుగా నీరంతా మళ్లీ పంట పొలాలగుండా ప్రవహిస్తుంది. వర్షాలు కురిసినప్పుడల్లా ఇలా వచ్చిన నీటితో భూమికి కోతలుపడే ప్రమాదముంది. ఈ ఏడాది అధికారులు దృష్టిసారిస్తేనే ఆయకట్టు కింద వందలాది ఎకరాలు నిలుస్తాయి. లేని పక్షంలో మళ్లీ బండరాళ్లు, ఇసుకమేటలు పంటపొలాలను నామరూపాల్లేకుండా చేసే ప్రమాదముంది.



పంట పొలాల్లో చేరిన బండరాళ్లు

సర్వే చేపట్టి హద్దులు గుర్తిస్తే..

సిరాల ప్రాజెక్ట్ ప్రధానకట్ట, ఇలేగాం చెరువు తెగిపోవడంతో వీటిలో చుక్క నీరు లేదు. రెవెన్యూ అధికారులు ఇలేగాం చెరువుకు సర్వే నిర్వహించి హద్దులు గుర్తిస్తే ఎంత మేర నష్టం జరిగిందో నిర్ధారించవచ్చు. శిఖం భూములు సాగుచేసే వారిపై చర్యలు తీసుకోవచ్చు. సిరాల ప్రాజెక్ట్ ఝురినాలా పూర్తిగా పంట భూమిగా మారింది. ఝురినాలా వెంబడి కబ్జాలను తొలగిస్తే ప్రాజెక్ట్ నుంచి వచ్చే వృథా నీరంతా అందులోంచే వెళ్తుంది. రెవెన్యూ అధికారులు ఇప్పటికైనా అప్రమత్తమై సిరాల ప్రాజెక్ట్, ఇలేగాం చెరువుతోపాటు ఝురినాలాల భూములు గుర్తించి ఆక్రమణలకు పాల్పడినవారిపై చర్యలు చేపట్టాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

అడుగంటిన బోర్లు, బావులు

సిరాల ప్రాజెక్ట్ నిర్మించిన నుంచి ఇప్పటి దాకా రెండేసార్లు ఎండిపోయింది. గతేడాది కట్ట తెగి నీరంతా బయటకు వెళ్లగా చుట్టుపక్కల గ్రామాల్లో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. తానూరు మండలం ఉమ్రి, బోల్సా, బెల్‌తరోడ, బోసి, భైంసా మండలం సిరాల, ఇలేగాం గ్రామాల్లో బోర్లు, బావులు వట్టిపోతున్నాయి. సిరాల గ్రామంలో పదుల సంఖ్యలో బోర్లున్నా ఒక్కదాంట్లో నీరు రావడంలేదు. యాసంగిలో బోర్లు, బావుల కింద రైతులు శనగ, మక్క సాగు చేయగా సాగునీరందక పంటలు ఎండుతున్నాయి.

కట్ట తెగి నష్టపోయిన



ప్రాజెక్ట్ ప్రధాన కట్ట తెగిన సమయంలో మా గ్రామంలోకి నీళ్లు వచ్చినయ్. మా గ్రామానికి ఆనుకుని ఉన్న నా వ్యవసాయ భూమి బండరాళ్లు, ఇసుకమేటలతో నిండింది. దీంతో పూర్తిగా నష్టపోయిన. ఇప్పటికైనా త్వరగా ప్రాజెక్ట్ మరమ్మతు పనులు చేపట్టి పూర్తి చేస్తేనే మళ్లీ పంటలు సాగు చేసుకుని జీవనం సాగిస్తం.

– గణేశ్, ఆయకట్టు రైతు, ఇలేగాం

నిధులు మంజూరయ్యాయి

సిరాల ప్రాజెక్ట్ పునర్నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. ప్రభుత్వం రూ.12.37 కోట్ల నిధులు మంజూరు చేసింది. ప్రాజెక్ట్ నిర్మాణం కోసం ఇప్పటికే నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసి వినతిపత్రం ఇచ్చాను. ఉన్నతాధికారులతో మాట్లాడాను. ప్రాజెక్ట్ అధికారులతో సమీక్ష నిర్వహించాం. ఆయకట్టు రైతులు నష్టపోకుండా చర్యలు తీసుకుంటాం. త్వరలోనే సిరాల ప్రాజెక్ట్ మరమ్మతు పనులు ప్రారంభమవుతాయి.

– పవార్ రామారావుపటేల్, ముథోల్ ఎమ్మెల్యే

ఈసీ నిబంధనలు పాటించాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్
- కలెక్టరేట్‌లో ఎన్నికల విధులపై ఎలక్షన్ మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

నిర్మల్‌చైన్‌గేట్: ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటించాలని జిల్లా ఎన్నికలాధికారి, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఎన్నికల విధులపై ఎలక్షన్ మాస్టర్ ట్రైనర్లకు నిర్వహించిన శిక్షణకు హాజరయ్యారు. ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారుల విధులు, బాధ్యతలు వివరించారు. అనంతరం మాట్లాడుతూ.. ఎన్నికలయ్యేదాకా విధుల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతీ పోలింగ్ కేంద్రంలో సీసీ కెమెరా ఏర్పాటు చేయాలని, పోలింగ్ రోజు ఉదయం రాజకీయ పార్టీల ఏజెంట్ల సమక్షంలో మాక్ పోల్ నిర్వహించాలని పేర్కొన్నారు. ఈవీఎంలు, వీవీ ప్యాట్లు, కంట్రోల్ యూనిట్లలో సాంకేతిక సమస్యలు తలెత్తితే వెంటనే సంబంధిత సెక్టోరల్ అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఎన్నికల విధులు నిర్లక్ష్యం చేస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. మాస్టర్ ట్రైనర్లు బీ శ్రీనివాస్, ఏ శ్రీనివాస్‌రెడ్డి, ఏ వేణుగోపాల్‌రావ్, పీ నారాయణవర్మ అధికారులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, శిక్షణ నోడల్ అధికారి, డీఈవో రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ కార్యవర్గం

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలో బుధవారం బార్ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా అల్లూరి మల్లారెడ్డి, ఉపాధ్యక్షురాలిగా వై.కవితారెడ్డి, సంయుక్త కార్యదర్శిగా ఏ ముత్తన్న, కోశాధికారిగా ఏ నర్సారెడ్డి, క్రీడా సాంస్కృతిక కార్యదర్శిగా పీ వంశీకృష్ణ, గ్రంథాలయ కార్యదర్శిగా సీహెచ్ అర్చన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా షేర్ నరేందర్, కొమ్మోజీ రమణ వ్యవహరించారు. ఈనెల 28వ తేదీన ప్రధాన కార్యదర్శి పదవికి ఎన్నిక నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

ఎట్టకేలకు ఖరారు

- కాంగ్రెస్ అభ్యర్థినిగా ఆత్రం సుగుణ
- సీఈసీ భేటీ తర్వాత జాబితా విడుదల
- ప్రధాన పార్టీల నుంచి తొలిసారి బరిలో మహిళా నాయకురాలు



ఆత్రం సుగుణ

సాక్షి,ఆదిలాబాద్: ఆదిలాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థినిగా ఆత్రం సుగుణ పేరు ఖరారు చేశారు. కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ (సీఈసీ) సమావేశం బుధవారం జరగగా, రాత్రి ఏఐసీసీ నుంచి తెలంగాణలోని మరో నలుగురి అభ్యర్థుల జాబితాను ప్రెస్‌కు రిలీజ్ చేశారు. ఇందులో ఆదిలాబాద్ స్థానానికి సుగుణ పేరు ప్రకటించారు. ఈమె ఆదివాసీలోని గోండు సామాజికవర్గానికి చెందినవారు. బీజేపీ అభ్యర్థి గోడం నగేశ్, బీఆర్ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కు ఇదే సామాజికవర్గానికి చెందినవారు. ఆదిలాబాద్ అభ్యర్థినిగా ప్రధాన పార్టీల నుంచి తొలిసారి ఓ మహిళ బరిలో నిలవడం గమనార్హం.

సుగుణ నేపథ్యమిది..

ఆత్రం సుగుణ ఉట్నూర్ జెడ్పీఎస్ఎస్‌లో ఉపాధ్యాయురాలిగా వ్యవహరిస్తూ ఇటీవలే స్వచ్ఛంద విరమణ చేసి కాంగ్రెస్‌లో చేరారు. భర్త భుజంగరావు కూడా ప్రభుత్వ ఉపాధ్యాయుడే. మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు డాక్టర్ విప్లవ్. చిన్న కుమారుడు సాయుధ సివిల్స్‌కు ప్రిపేర్ అవుతున్నాడు. ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా నియామకానికి ముందు సుగుణకు రాజకీయాలతో పరిచయం ఉంది. 1995లో జన్నారం మండలం ముర్రిమడుగు ఎంపీటీసీగా గెలుపొందారు. 2008లో డీఎస్సీ ద్వారా ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా నియమితులయ్యారు. కాగా, మానవ హక్కుల వేదిక జిల్లా కార్యదర్శిగా, ఆదివాసీ మహిళా సంఘం రాష్ట్ర ప్ర ధాన కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. ప్రజా ఉద్యమాల్లో ఆమె చురుకైన పాత్ర పోషిస్తూ వస్తున్నారు. రాజకీయాల్లో ఆసక్తితో ఈ రంగంలోకి అడుగుపెట్టా రు. కుమురంభీం ఆసిఫా బాద్ జిల్లా సిర్పూర్(యు) మండలం పుల్లార గ్రామంలో ఆమె జన్మించారు. ఆ త్రం భుజంగరావుతో ఆమె కు 1992లో వివాహమైంది. ఇద్దరు పిల్లలు పుట్టాక తిరిగి చదువుకుని పదో తరగతి పాసయ్యారు. ఆ తర్వాత ఉన్నత విద్య అభ్యసించారు. ప్రస్తుతం ఉట్నూర్‌లో స్థిర నివాసం ఏర్పర్చుకున్నారు.

బయోడేటా..

పేరు	ఆత్రం సుగుణ
భర్త పేరు	ఆత్రం భుజంగరావు
విద్యార్హత	బీఏ (హెచ్‌పీపీ) బీఈడీ, ఎంఏ (తెలుగు)
పుట్టిన తేదీ	16.08.1975
కులం	ఎస్టీ (గోండు)
సంతానం	ఇద్దరు కుమారులు (డాక్టర్ ఆత్రం విప్లవ్, ఆత్రం సాయుధ)

ఏఐసీసీ.. పొరపాటు!

- జాబితాలో డాక్టర్ సుగుణ కుమారి పేరు
- పొరపాటున వచ్చిందని చెప్పిన ఇన్‌చార్జి మంత్రి సీతక్క

సాక్షి,ఆదిలాబాద్: ఏఐసీసీ నుంచి బుధవారం రాత్రి విడుదల చేసిన కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థుల జాబితాలో పొరపాటు చోటు చేసుకుంది. ఆదిలాబాద్ ఎస్టీ రిజర్వుడ్ నియోజకవర్గం నుంచి డాక్టర్ సుగుణ కుమారి చెలిమలను ఖరారు చేస్తున్నట్లు పొందుపర్చారు. అయితే డాక్టర్ సుగుణకుమారి ఇదివరకు పెద్దపల్లి నియోజకవర్గం నుంచి పార్లమెంట్ సభ్యురాలిగా వ్యవహరించారు. పెద్దపల్లి ఎస్సీ రిజర్వుడ్ నియోజకవర్గం. డాక్టర్ సుగుణకుమారి ఎవరా అని మొదట ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో కన్ఫ్యూజన్ ఎదురైంది. తీరా అది ఏఐసీసీ నుంచి పొరపాటు చేసుకుందని తెలిసింది. కాగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క స్వయంగా ఆత్రం సుగుణకు ఫోన్ చేసి జాబితాలో జరిగిన పొరపాటును వివరించడం జరిగింది. కాగా రాత్రి సమయంలో ఆ జాబితాను సవరించి ఆత్రం సుగుణ పేరుతో జారీ చేశారు.

ఉపాధి వేటలో వలసబాట



లోకేశ్వరంలో పసుపు తీస్తున్న మహారాష్ట్ర కూలీలు

- స్థానికంగా వేధిస్తున్న కూలీల కొరత
- జిల్లాకు పొరుగు రాష్ట్రాల కూలీలు
- ఏటా వ్యవసాయ కూలీలుగా జీవనం
- గుడారాల్లో పిల్లాపాపలతో నివాసం

లోకేశ్వరం: మన జిల్లాకు పొరుగు రాష్ట్రాల నుంచి ఏటా వలసలు కొనసాగుతున్నాయి. ఉపాధి వేటలో మహారాష్ట్ర, బీహార్, ఉత్తరప్రదేశ్ కూలీలు జిల్లాకు వస్తున్నారు. వ్యవసాయ కూలీలుగా జీవనం గడిస్తున్నారు. వానాకాలం, యాసంగి సీజన్లలో వేల సంఖ్యలో జిల్లాకు వస్తున్నారు. పిల్లాపాపలతో వచ్చి గ్రామాల్లో గుడారాలు వేసుకుని నివాసముంటున్నారు. వరి, పసుపు, మక్క, జొన్న తదితర పంటల సాగులో కూలీలుగా ఉపాధి పొందుతున్నారు. వారి పనితీరు బాగుండడం, స్థానికంగా కూలీల కొరత ఉండగా వలస కూలీలకు డిమాండ్ పెరిగింది.

గుత్తాలు పట్టి పనులు..

ఎకరం వరి నాటు వేస్తే రూ.4,500 నుంచి రూ.5,400 వరకు, ఎకరం మక్క కోతకు రూ.4,500 వరకు తీసుకుంటున్నారు. వరి నాట్లు పూర్తవగానే వారి స్వస్థలాలకు వెళ్తారు. మళ్లీ పసుపు పంట తవ్వడానికి, మక్క, జొన్న కోతలకు ఇక్కడకు వస్తారు. పసుపు తవ్వేందుకు మహారాష్ట్ర నుంచి అధికసంఖ్యలో కూలీలు వస్తుంటారు. పసుపు తవ్వేగ్రూపులో 20 మంది కూలీలుంటారు. ఎకరాకు రూ.16,500తో పాటు 50 కేజీల బియ్యం తీసుకుంటున్నారు.

కుటుంబాలతో కలిసి..

పసుపు తవ్వకాలకు మహారాష్ట్ర నుంచి కూలీలు పిల్లాపాపలతో వస్తుంటారు. ఒక్కో గ్రూపులో ఎనిమిది మంది భార్యాభర్తలుంటారు. వీరి బాగోగులన్నీ స్థానిక రైతులే చూసుకుంటారు. గ్రామాల్లో నివాసం, వసతులు సమకూరుస్తారు. వలస కూలీలు గుడారాలు వేసుకుని అందులోనే రెండునెలల పాటు జీవనం సాగిస్తారు. రోజంతా పని చేస్తే ఒక్కో జోడికి రూ.వెయ్యిదాకా కూలి దొరుకుతుంది.

హమాలీలుగా బీహార్ కూలీలు..

ఏటా వానాకాలం, యాసంగి సీజన్లలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో బీహార్ హమాలీలే ఎక్కువగా కనిపిస్తుంటారు. ఇక్కడ వరి కోతల సీజన్‌లో వారి ప్రాంతాల్లో పనులుండవు. దీంతో వారు ధాన్యం కొనుగోళ్ల సమయంలో ఇక్కడి కొనుగోలు కేంద్రాలకు వస్తుంటారు. ప్రతీ సీజన్‌లో జిల్లాకు సుమారు మూడువేల మంది ఇక్కడకు వచ్చి ఉపాధి పొందుతుంటారు. ఒక్కో కొనుగోలు కేంద్రంలో 10–20 మంది హమాలీలుగా పని చేస్తుంటారు. ధాన్యం బస్తాలు నింపి తూకం వేయడంతో పాటు లారీల్లో నింపుతారు. ఈ పనులకు స్థానికంగా కూలీలు దొరకరు. దీంతో కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు బీహార్, మహారాష్ట్రలోని నాందేడ్, అమరావతి ప్రాంతాల నుంచి హమాలీలను ఇక్కడికి రప్పిస్తుంటారు. ఇక్కడి ప్రతీ రైస్‌మిల్లులోనూ బీహార్ హమాలీలే కనిపిస్తారు.



రాయపూర్‌కాండ్లీ కొనుగోలు కేంద్రంలో హమాలీ పనిలో బీహార్ కూలీలు (ఫైల్)

రూ.20వేల దాకా ఆదాయం

మహారాష్ట్ర, బీహార్ నుంచి వచ్చే కూలీలు కొనుగోలు కేంద్రాల వద్దే కుటుంబాలతో ఉంటారు. ఒక్కో కేంద్రంలో 10–20 మంది వరకు పని చేస్తుంటారు. ధాన్యాన్ని బట్టి వీరి సంఖ్య పెరగవచ్చు. ధాన్యాన్ని సంచుల్లో నింపడం, తూకం వేయడం, తర్వాత లారీల్లోకి ఎక్కించడం లాంటి పనులు చేస్తుంటారు. ఇందుకు క్వింటాల్‌కు రూ.23–రూ.29 వరకు తీసుకుంటారు. కొనుగోలు కేంద్రానికి వచ్చిన ధాన్యాన్ని బట్టి ఒక్కొక్కరికీ రోజుకు రూ.500 నుంచి రూ.వెయ్యి వరకు కూలి గిట్టుబాటవుతుంది. ఇలా ఒక్కో సీజన్‌లో ఒక్కొక్కరు రూ.25 వేల వరకు సంపాదిస్తారు.

భూములున్నా వలస వచ్చిన



మహారాష్ట్రలో మాకు వ్యవసాయ భూములున్నయ్. కానీ.. బోరుబావులే లేవు. వర్షాలు పడితేనే పంటలు పండిస్తం. పంట లేనపుడు ఈ జిల్లాకు వచ్చి వ్యవసాయ కూలీలుగా పని చేస్తం. ఎనిమిదేండ్ల నుంచి పసుపు తవ్వడానికి వస్తున్న. కూలి గిట్టుబాటవుతున్నది.

– లక్ష్మణ్, మహారాష్ట్ర

ప్రతీ సీజన్‌లో వస్తం



మాదగ్గర సాగు నీటి సమస్య ఉంది. వర్షాధారంగా కందులు, మినుములు, పెసర పంటలు పండుతయ్. ఆ తర్వాత పని దొరకదు. దీంతో ఇక్కడికి వలస వస్త. వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లో హమాలీ పని చేస్తున్న. ఇక్కడ ఉపాధి బాగానే ఉంది.

– రాంజీ, మహారాష్ట్ర

కొనుగోలు కేంద్రంలో పని చేస్త




ఎనిమిదేళ్లుగా ప్రతీ సీజన్‌లో ఈ జిల్లాకు వస్తున్నం. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పని చేస్తున్నం. కుటుంబాలను వెల్లదీస్తున్నం. ప్రతీ సీజన్‌లో వచ్చిన ధాన్యాన్ని బట్టి రూ.10వేల నుంచి రూ.20 వేల వరకు సంపాదిస్తం.

– అశోక్ సర్దార్, బీహార్

సీఎం రేవంత్‌రెడ్డి బ్లాక్‌మెయిలర్

- బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: 'రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఒక బ్లాక్‌మెయిలర్ సీఎం. ఫార్మా కంపెనీలు, రియల్టర్లను భయపెడుతూ రూ.లక్షల కోట్లు వసూలు చేస్తున్నారు. ఇప్పటికే ఢిల్లీకి రూ.1,500 కోట్లు పంపించారు..' అని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి తీవ్ర స్థాయిలో ఆరోపించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. నిండా అవినీతిలో మునిగిన మాజీ మంత్రి హరీశ్‌రావు చిలుక పలుకులు పలుకుతున్నారని, పక్కా ఆధారాలతోనే లిక్కర్ కేసులో ఎమ్మెల్సీ కవిత అరెస్టయిందని చెప్పారు. ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి నగేశ్ ఎన్నో ఏళ్లుగా వివిధ పదవులు నిర్వర్తించి ఇక్కడి ప్రజలకు ఎంతో సేవ చేశారని తెలిపారు. మరోసారి నగేశ్‌ను ఎంపీగా గెలిపించుకుని ప్రధాని మోదీకి కానుకగా ఇచ్చేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. చేసిన అవినీతి, అక్రమాల నుంచి తప్పించుకునేందుకు మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అధికార పార్టీలో చేరే ప్రయత్నాలు చేస్తున్నారని, ఏ పార్టీలోకి వెళ్లినా.. ఎన్ని జిమ్మిక్కులు చేసినా వదిలిపెట్టే ప్రసక్తే లేదని తెలిపారు. సోఫీనగర్‌లో ప్రభుత్వ భూమిలో నిర్మిస్తున్న డీమార్ట్ విషయం, గాజులపేటలోని శ్రీకృష్ణ దేవాలయ భూముల అన్యాక్రాంతంపై ఇప్పటికే కలెక్టర్, రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు చేపట్టాలని, లేనిపక్షంలో ప్రజల పక్షాన ప్రతిపక్ష నేతగా పోరాటం చేస్తానని చెప్పారు. ఆదిలాబాద్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి గోడం నగేశ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు అంజికుమార్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు సాదం అరవింద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మహేశ్వర్‌రెడ్డి

సీఎంఆర్ లక్ష్యం గడువులోపు పూర్తి చేయాలి

నిర్మల్‌చైన్‌గేట్: సీఎంఆర్ లక్ష్యాన్ని గడువులోపు పూర్తి చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రైస్ మిల్లర్లు, పౌర సరఫరాలశాఖ అధికారులతో సీఎంఆర్ లక్ష్యం, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాట్లు తదితర అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిబంధనలు పాటించని మిల్లర్లపై చర్యలు తప్పవన్నారు. అనంతరం మిల్లర్ల వారీగా లక్ష్యం, పూర్తిచేసిన సీఎంఆర్, పెండింగ్‌పై చర్చించారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు పక్కా ప్రణాళిక తయారు చేయాలని, రైతులకు ఇబ్బంది కలగకుండా చూడాలని సూచించారు. అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిశోర్‌కుమార్, డీఎస్వో నందిత, సివిల్ సప్లయ్ డీఎం శ్రీకళ, అధికారులు, మిల్లర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

హాస్పిటల్స్‌లైన్‌లో అగ్ని ప్రమాదం

నిర్మల్‌టౌన్ : జిల్లా కేంద్రంలోని హాస్పిటల్స్ లైన్ కాలనీలో మంగళవారం రాత్రి అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ట్రాన్స్‌ఫార్మర్ కింద ఉన్న చెత్తకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో మంటలు వ్యాపించాయి. గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని మంటలు ఆర్పివేసినట్లు ఫైర్ అధికారి జయంతి రామ్ తెలిపారు.

యాచకుడు మృతి

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని సోఫీనగర్ కాలనీలో యాచకుడు నర్సయ్య మంగళవారం రాత్రి (75) మృతి చెందాడు. మృతుడు స్థానిక సోఫీనగర్ కాలనీలో పదిహేనేళ్లుగా ఒంటరిగా నివాసం ఉంటున్నాడు. కాలనీలో భిక్షాటన చేస్తూ కాలం వెల్లదీస్తున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అమ్మవారికి హుండీల విరాళం


చైర్మన్‌ను సన్మానిస్తున్న ఆలయ సిబ్బంది

భైంసా: బాసర సరస్వతీ అమ్మవారిని తెలంగాణ గ్రామీణ బ్యాంకు చైర్మన్ శోభ బుధవారం దర్శించుకున్నారు. సరస్వతీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. బ్యాంకు తరఫున ఆలయానికి రూ. 80వేలు విలువ చేసే రెండు స్టీల్ కానుక హుండీలను విరాళంగా అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణ అధికారి విజయరామారావు, రీజినల్ మేనేజర్ రామారావు, బాసర శాఖ మేనేజర్ రామ లక్ష్మి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

మద్యానికి బానిసై ఆత్మహత్య


రాజు మృతదేహం

భైంసారూరల్: మండలంలోని టాక్లి గ్రామానికి చెందిన తలుపుల రాజు(32) ఆత్మహత్యకు పాల్పడ్డట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. మద్యానికి బానిసైన రాజు బుధవారం రోజు అతిగా మద్యం సేవించాడు. మద్యం మత్తులో గ్రామంలోని నీటి ట్యాంకులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుని తండ్రి శివయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వెల్లడించారు.

నగదు పట్టివేత


పట్టుకున్న నగదుతో ఎస్సై సందీప్

తానూరు: మండలంలోని బెల్‌తరోడా సరిహద్దులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద బుధవారం రూ.1.40 లక్షల నగదు పట్టుకున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు. మహారాష్ట్ర నుంచి భైంసా వైపు వెళ్తున్న వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా మహారాష్ట్రలోని భోకర్ తాలూకా రావన్‌గాం గ్రామానికి చెందిన వ్యక్తి వద్ద రూ.1.40 లక్షలు పట్టుబడ్డాయి. నగదుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

ఒకరిపై కేసు నమోదు

ఆదిలాబాద్‌టౌన్: ద్విచక్ర వాహనాన్ని ట్రాక్టర్‌తో ఢీకొట్టిన కేసులో ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ అశోక్ తెలిపారు. ఈ నెల 24న మధ్యాహ్నం 2 గంటల సమయంలో మహాలక్ష్మివాడకు చెందిన నరేష్ ద్విచక్ర వాహనంపై పట్టణంలోని తిర్పెల్లి నుంచి మహాలక్ష్మివాడకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో ట్రాక్టర్ డ్రైవర్ వెనుక నుంచి ఢీకొట్టాడు. బాధితుడు ఆస్పత్రిలో చికిత్స పొందిన అనంతరం బుధవారం ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ పేర్కొన్నారు. ట్రాక్టర్ డ్రైవర్ పరారీలో ఉన్నట్లు వివరించారు.

దోసకాయలు C/O కనకాపూర్


దోస కాయలు తెంపుతున్న రైతులు

- సాగు చేస్తూ లాభాలు గడిస్తున్న రైతులు
- గ్రామంలోని జాతీయ రహదారిపైనే విక్రయం

లక్ష్మణచాంద(నిర్మల్): మండలంలోని కనకాపూర్ గ్రామం దోసకాయలకు కేరాఫ్‌గా నిలుస్తోంది. గ్రామానికి చెందిన 20 నుంచి 30 మంది రైతులు ఇతర గ్రామాల రైతులకు భిన్నంగా వేసవికాలంలో చల్లదనాన్ని ఇచ్చే దోసకాయలు సాగు చేస్తూ లాభాలు గడిస్తున్నారు. మిగిలిన పంటల కంటే తక్కువ సమయంలో సాగయ్యే దోస కేవలం 45 రోజుల్లోనే పంట చేతికి వస్తుంది. రైతులు తాము పండించిన దోసకాలను స్వయంగా జాతీయ రహదారిపై కిలోకు రూ.60 నుంచి రూ.80 చొప్పున విక్రయిస్తున్నారు.

తక్కువ పెట్టుబడి,ఎక్కువ ఆదాయం

ఇతర పంటల కంటే తక్కువ పెట్టుబడితో దోస పంటను సాగు చేస్తున్నామని కనకాపూర్ రైతులు పేర్కొంటున్నారు. ఎకరాకు రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు ఖర్చు వస్తుందని రైతులు తెలిపారు. మధ్య దళారీలు లేకపోవడంతో రైతులు పండించిన దోస కాయలను నేరుగా తమ గ్రామంలోని బస్టాండ్‌లో అమ్ముతున్నారు. ఎకరాకు ఖర్చులు పోనూ రూ.80 వేల నుంచి లక్ష వరకు లాభాలు వస్తున్నాయని రైతులు తెలిపారు.

సేంద్రియ ఎరువులతో సాగు

దోస పంట సాగుకు ఇక్కడి రైతులు రసాయన ఎరువులకు దూరంగా ఉంటున్నారు. అధికంగా సేంద్రియ ఎరువులను పంట సాగుకు వినియోగిస్తున్నారు. రసాయన ఎరువుల వాడకం తగ్గడంతో ఖర్చులు కూడా తక్కువగానే ఉన్నాయని రైతులు పేర్కొంటున్నారు.

శ్రమ తక్కువ



వేసవికాలంలో దోస పంట సాగుతో తక్కువ శ్రమతో ఎక్కువ లాభాలు గడించవచ్చు. పంట సాగుకు రసాయన ఎరువులు వినియోగం ఉండదు. సాగు ఖర్చులు కూడా తక్కువే. తక్కువ శ్రమతో ఈ పంటను సాగు చేయవచ్చు.

– రాజు, యువ రైతు, కనకాపూర్

మంచి ఆదాయం



ఎకరా విస్తీర్ణంలో దోస పంట సాగు చేశా. సాగు ఖర్చులు పోనూ రూ.60 వేల నుంచి రూ.80 వేల వరకు ఆదాయం వచ్చింది. ఇతర పంటలతో పోలిస్తే తక్కువ సమయంలో ఎక్కువ ఆదాయం వచ్చే పంట.

– రఘు, యువ రైతు, కనకాపూర్

అధికారులు బాధ్యతతో పనిచేయాలి


మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షిషా
- ఆదిలాబాద్ లోక్‌సభ నియోజకవర్గ అధికారుల సమావేశం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో జరిగే పార్లమెంటు ఎన్నికలను స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేందుకు ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. బుధవారం ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఆదిలాబాద్, బోథ్, నిర్మల్, ముథోల్, ఖానాపూర్, ఆసిఫాబాద్, సిర్పూర్(టి) అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలోని ఏఆర్వో, ఎస్‌డీపీలతో కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో మొత్తం 2,111 పోలింగ్ కేంద్రాలు, బ్యాలెట్ యూనిట్స్ 2,638 కంట్రోల్ యూనిట్స్ 2,638, వీవీప్యాట్స్ 2,908, మొబైల్ కనెక్టివిటీ 2,039 ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. షాడో పోలింగ్ కేంద్రాలు సిర్పూర్‌లో 11 , ఆసిఫాబాద్‌లో 28, ఖానాపూర్‌లో 9, ఆదిలాబాద్‌లో 9, బోథ్‌లో 14, నిర్మల్‌లో 1 ఉన్నాయన్నారు. పోలింగ్ సిబ్బందికి ఏప్రిల్ 3, 4 తేదీలలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎన్నికల విధుల్లో ఉన్న ప్రతిఒక్కరూ ఫారం 12డి ఉపయోగించాలన్నారు. సెక్టోరల్ అధికారులకు టీంవైజ్‌గా శిక్షణ ఇవ్వాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద గట్టి నిఘా ఏర్పాటు చేయాలన్నారు. ఎస్పీ గౌస్ ఆలం మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఆరు అంతర్రాష్ట్ర చెక్ పోస్టులు, రెండు అంతర్ జిల్లా చెక్ పోస్టులను ఏర్పాటు చేసి నిరంతరం తనిఖీ చేస్తున్నామన్నారు. ఎలాంటి సిగ్నల్ వ్యవస్థ లేని షాడో పోలింగ్ స్టేషన్ ప్రాంతాలను గుర్తించి కమ్యూనికేషన్ వ్యవస్థను పటిష్టం చేసేలా వీహెచ్‌ఎఫ్ సెట్లను ఉపయోగించాలన్నారు. ఇతర రాష్ట్రాల పోలీస్ సిబ్బందితో సమన్వయం కోసం ఇంటర్ స్టేట్ బోర్డింగ్ జిల్లాలతో సమావేశాలు నిర్వహించామన్నారు. సమావేశంలో ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, ట్రెయినీ కలెక్టర్ వికాస్ మహతో, నిర్మల్ అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, ఆదిలాబాద్ అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆదిలాబాద్, నిర్మల్, కుమురంభీం ఆసిఫాబాద్, ఏఎస్‌డీఎస్పీలు, డీఎస్పీలు, ఆర్డీవోలు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

వైన్‌షాపు ఎదుట మృతదేహంతో ఆందోళన


మృతదేహంతో బైఠాయించిన కుటుంబ సభ్యులు

లోకేశ్వరం: మండల కేంద్రానికి చెందిన పోతరాజుల ప్రశాంత్ అతిగా మద్యం సేవించి లోకేశ్వరం కొత్త బస్టాండులోని లక్కీ వైన్స్ పర్మిట్ రూంలో మంగళవారం మృతి చెందాడు. మృతిపై అనుమానాలు ఉన్నాయంటూ గ్రామస్తులు, కుటుంబ సభ్యులు బుధవారం వైన్స్‌షాపు ఎదుట మృతదేహంతో ఆందోళనకు దిగారు. ముథోల్ సీఐ మల్లేశ్, లోకేశ్వరం ఎస్సై రాజు నచ్చజెప్పినా ఆందోళనకారులు వినిపించుకోలేదు. ఆందోళన 5 గంటల వరకు సాగడంతో కొత్త బస్టాండు ప్రాంతంలోకి రాకపోకలను నిలిపివేశారు. మృతిపై సమగ్ర విచారణ జరిపి నిజానిజాలు బయటకు వచ్చేంత వరకు ఆందోళన విరమించేది లేదని భీష్మించుకు కూర్చున్నారు. విషయం తెలుసుకున్న ఎంపీటీసీ సభ్యుడు జయసాగర్‌రావు, మాజీ సర్పంచ్ మెండే శ్రీధర్, కాంగ్రెస్ నాయకుడు శ్రీనివాస్ ఆందోళనకారులు, వైన్స్ యాజమానులతో మాట్లాడారు. బాధిత కుటుంబానికి రూ.2లక్షల 50వేల ఆర్థికసాయం అందించేందుకు ఒప్పందం కుదరడంతో ఆందోళన విరమించారు.

అనుమానాస్పదంగా యువకుడు మృతి

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని శివాజీచౌక్‌లో గల ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న లోకేశ్వరం మండలం బాగాపూర్ గ్రామానికి చెందిన అర్ష లక్ష్మణ్ (25) బుధవారం అనుమానాస్పదంగా ఆస్పత్రిలోనే మృతి చెందాడు. పోలీసులకు సమాచారం అందించడంతో నిర్మల్ పట్టణ, రూరల్, సోన్ సీఐలు అనిల్, శ్రీనివాస్, నవీన్ కుమార్ మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న మృతుని కుటుంబ సభ్యులు ఆస్పత్రికి చేరుకుని వైద్యులను నిలదీశారు. మృతికి కారణాలు తెలియాలని, నిన్నటి వరకు బాగానే ఉన్న తమ కుమారుడు మృతి చెందడం ఏమిటని, మృతదేహాన్ని మార్చురీకి ఎందుకు తరలించారని ఆసుపత్రి యాజమాన్యంతో వాగ్వాదానికి దిగారు. అక్కడే ఉన్న పోలీసులు గొడవను సద్దుమణిగేలా చేశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పట్టణ సీఐ అనిల్ కుమార్ తెలిపారు.

ఆత్మహత్యకు ప్రేమే కారణమా?

పట్టణంలోని అదే ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న ఓ యువతి, లక్ష్మణ్ కొంతకాలంగా చనువుగా ఉంటున్నారు. ఈ క్రమంలో ఆ యువతి మరోవ్యక్తితో మరింత చనువుగా ఉండడాన్ని జీర్ణించుకోలేక ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సూసైడ్ నోట్ రాసి లక్ష్మణ్ ఆత్మహత్య చేసుకున్నాడు. సూసైడ్ నోట్ ఆధారంగా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కిడ్నాప్ కేసులో 8 మంది రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: ప్రేమ జంటపై దాడిచేసి కిడ్నాప్ చేసిన కేసులో ఎనిమిది మందిని రిమాండ్‌కు తరలించినట్లు వన్‌టౌన్ ఎస్సై హబీబ్‌ఖాన్ తెలిపారు. నిర్మల్‌లోని బేస్తార్‌పేట్‌కు చెందిన కాళ్ల విజయ్ హైదరాబాద్‌లోని జాహ్నవి కన్వెన్షన్ హాల్‌లో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. అక్కడ పనిచేసే సంయుక్తను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. ఆ తర్వాత అక్కడి నుంచి వచ్చి ఆ ప్రేమ జంట ఆదిలాబాద్‌లోని అశోక్‌రోడ్‌లో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. ఈ నెల 25న సంయుక్త కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలో వారు ఉంటున్న నివాసానికి వచ్చారు. ఆదిలాబాద్ పట్టణానికి చెందిన పలువురు వారి వెంట రాగా ఆ ప్రేమ జంటపై దాడికి దిగారు. ఆమెను కిడ్నాప్ చేసేందుకు యత్నిస్తూ బస్సులో తీసుకెళ్లారు. ఇందులో మొత్తం 12 మంది ఉండగా 8 మందిని గుర్తించి వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. రిమాండ్ అయిన వారిలో అవేజ్ బేగ్, సయ్యద్ హైజా ఉద్దీన్, సోఫియాన్ ఖాన్, సోహెబ్ ఖాన్, షాదాబ్ ఖాన్, సయ్యద్ మినాజ్, అబ్దుల్ ఆసిఫ్, మహ్మద్ సైబద్‌లు ఉండగా, అస్లమ్, జునేద్, అఫ్సర్, షాదుల్లా పరారైనట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఆ గ్రామానికి.. రాళ్ల రోడ్డు


రోడ్డు సరిగా లేక వాటర్‌ట్యాంక్ వెళ్లేందుకు అవస్థ


గ్రామానికి చేరాలంటే ఈ రోడ్డే దిక్కు


గిరిజనులు ఏర్పాటు చేసుకున్న రోడ్డు

స్వాతంత్ర్యం సిద్ధించి 75ఏళ్లు దాటినా నేటికీ గిరి గ్రామాలకు సరైన రోడ్డుమార్గం లేదు. ఆదిలాబాద్ రూరల్ మండలంలోని పూనగూడ నుంచి అసోదబుర్కికి వెళ్లే రోడ్డు రాళ్లు, రప్పలతో అధ్వానంగా మారింది. దీంతో రాకపోకలు సాగించేందుకు గిరిజనులు నానా తిప్పలు పడుతున్నారు. తమ రోడ్డును బాగు చేయాలని స్థానికులు ప్రజాప్రతినిధులకు, అధికారులకు పలుమార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోయింది. దీంతో వర్షాకాలంలో ఇబ్బందులు పడాల్సి వస్తుందనే ఉద్దేశంతో గిరిజనులే ఇంటికి రూ.1,500 చొప్పున పోగు చేసుకుని రోడ్డును బాగు చేసుకున్నారు. పాలకుల పట్టింపులేనితనానికి ఈ చిత్రాలే నిదర్శనం.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

నీటి కోసం పడిగాపులు



నార్నూర్: మండలంలోని సుంగాపూర్‌లో మూడురోజులుగా మిషన్ భగీరథ నీటిసరఫరా నిలిచిపోయింది. గ్రామంలో 100 గిరిజన, 30 దళిత కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. వారంతా మిషన్ భగీరథ నీటిపైనే ఆధారపడ్డారు. మూడు రోజులుగా నీటిసరఫరా నిలిచిపోవడంతో దాదాపు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న తండా నుంచి నీటిని తెచ్చుకుంటున్నారు. సంబంధిత శాఖ అధికారులకు సమాచారం అందించినా పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రేపటిలోగా సమస్య పరిష్కరించకుంటే ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగుతామని గ్రామస్తుడు రాందాస్ హెచ్చరించారు.

డ్రైవర్‌కు ఐదు నెలల జైలు

కడెం: మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన ఐచర్‌వ్యాన్ డ్రైవర్ నీరటి రాజేందర్‌కు ఐదు నెలల జైలుశిక్ష విధిస్తు ఖానాపూర్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ జితిన్‌కుమార్ బుధవారం తీర్పునిచ్చారు. మూడేళ్ల క్రితం మండలంలోని బెల్లాల్ ఎక్స్‌రోడ్డు వద్ద ఐచర్ వ్యాన్ అజాగ్రత్తగా నడిపి ఆటోను ఢీకొట్టడంతో పలువురికి గాయాలయ్యాయి. సోన్ మండలం కూచన్‌పెల్లికి గ్రామానికి చెందిన పూదరి రాజశేఖర్ కడెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై కోదాడి రాజు కేసు దర్యాప్తు చేశారు. వాదోపవాదలు జరిగి బుధవారం కేసు నేరారోపణ రుజువుకు సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా మెజిస్ట్రేట్ ఐదు నెలల జైలు శిక్ష, రూ.1500ల జరిమానా విధించారని ఎస్సై కృష్ణ సాగర్‌రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు


గాయాల పాలైన పవన్, సాయికుమార్, సాయిచరణ్

ఉట్నూర్‌రూరల్: మండలంలోని పెర్కగూడ సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై మనోహర్, సర్పంచ్ హరినాయక్, తెలిపిన వివరాల ప్రకారం.. ఆసిఫాబాద్ జిల్లా లింగాపూర్‌కు చెందిన సాయికుమార్, పవన్, సాయిచరణ్ ద్విచక్ర వాహనంపై ఉట్నూర్‌కు వచ్చి వెళ్తుండగా పెర్కగూడ సమీపంలో ఎదురుగా వస్తున్న ట్రాలీ ఆటోను ఢీ కొట్టారు. దీంతో ట్రాలీ ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో సాయిచరణ్, పవన్‌కు తీవ్రంగా సాయికుమార్‌కు స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు, స్థానిక సర్పంచ్ హరినాయక్ 108 ద్వారా ఉట్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్య సేవల కోసం ఆదిలాబాద్ రిమ్స్‌కు రెఫర్ చేశారు. సంఘటనపై బాధ్యులు ఫిర్యాదు చేస్తే పూర్తి విచారణ చేపడుతామని ఎస్సై పేర్కొన్నారు.

గంటసేపయినా రాని 108

క్షతగాత్రులను రిమ్స్‌కు రెఫర్ చేయాల్సి ఉండగా గంట సేపయినా 108 అంబులెన్స్ రాకపోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా చూడాలని కోరుతున్నారు.

ఐదు తెగల ఆదివాసీలను గుర్తించాలి


నినాదాలు చేస్తున్న ఆదివాసీ తెగల పెద్దలు

ఇంద్రవెల్లి: ఆదివాసీలోని పర్ధాన్, తోటి, నాయక్‌పోడ్, అంద్, కొలాం గిరిజనులను ఆయా రాజకీయ పార్టీలు గుర్తించి న్యాయం చేయాలని ఐదు తెగల కార్యాచరణ కమిటీ పెద్దలు డిమాండ్ చేశారు. మండలంలోని అమరవీరుల స్తూపం వద్ద బుధవారం సమావేశమయ్యారు. ముందుగా అమరులకు నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడారు. ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో ఐదు తెగల ఆదివాసీ ఓటర్లు సుమారు రెండు లక్షలకు పైగా ఉన్నట్లు తెలిపారు. అయితే రాజకీయ పరంగా ఇప్పటి వరకు తమను ఏ పార్టీ గుర్తించలేదన్నారు. ఇప్పటికైనా గుర్తించకపోతే భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని తీర్మానం చేశారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా పరిధిలోని ఐదు తెగల సంఘాల నాయకులు ఆర్క ఖమ్ము, దుర్వ నగేశ్, వసంత్ రావ్, అశోక్, భీముడు, పాండురంగ్, రమేశ్, వెంకటేశ్, తిరుపతి తదితరులున్నారు.

పరిశోధనలు పొలాల్లోకి చేరాలి

జగిత్యాలఅగ్రికల్చర్: వ్యవసాయ శాస్త్రవేత్తల పరిశోధనలు పొలాల్లోకి చేరాలని, అప్పుడే రైతులకు మేలు జరుగుతుందని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం రీసెర్చ్ డైరెక్టర్ రఘురామిరెడ్డి అన్నారు. ఉత్తర తెలంగాణ ప్రాంతంలో వరి విస్తీర్ణం 21శాతానికి పెరిగిందని, సోయాచిక్కుడు విస్తీర్ణం 10 శాతం పెరిగిందని, చెరుకు విస్తీర్ణం మాత్రం 73 శాతం, పెసర 61 శాతం, మొక్కజొన్న 12 శాతం, కందుల విస్తీర్ణం 8శాతం, పత్తి విస్తీర్ణం నాలుగు శాతం తగ్గడం ఆందోళన కలిగిస్తోందని తెలిపారు. జగిత్యాల రూరల్ మండలం పొలాస వ్యవసాయ పరిశోధన స్థానంలో ఉత్తర తెలంగాణ జోనల్ స్థాయి శాస్త్రవేత్తల సమావేశాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల వ్యవసాయ శాస్త్రవేత్తలు, ఆయా జిల్లాల వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు పాల్గొన్నారు. వ్యవసాయ వర్సిటీ డైరెక్టర్ ఆఫ్ ఎక్స్‌టెన్షన్ సుధారాణి, పొలాస వ్యవసాయ పరిశోధన స్థానం డైరెక్టర్ శ్రీనివాస్, అగ్రికల్చర్ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర డైరెక్టర్ బాలు మాట్లాడారు.

భవానీగూడను సందర్శించిన ఏసీఎం

బేల: ఐటీడీఏ పీవో ఆదేశాల మేరకు మండలంలోని భవానీగూడ(సి) గ్రామాన్ని బుధవారం ఏసీఎం జగన్ సందర్శించారు. గ్రామంలో నీటి సమస్యతో పాటు త్రీఫేజ్ విద్యుత్, సాగునీరు, తదితర సమస్యలపై ఆరా తీశారు. సమస్యను ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు.

బాసరలో ప్రేమికుల ఆత్మహత్య..?

- రైలు కిందపడి సూసైడ్!
- మృతులు నిజామాబాద్ వాసులు

భైంసా: నిర్మల్ జిల్లా బాసర రైల్వేస్టేషన్‌లో ప్రేమికులుగా భావిస్తున్న ఇద్దరి ఆత్మహత్య కలకలం రేపింది. రైలుకింద పడి యువతీ, యువకుడు ఆత్మహత్య చేసుకున్నారు. రైల్వేపోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాసర రైల్వేస్టేషన్‌లో బుధవారం రాత్రి నర్సాపూర్–నాగర్‌సోల్ రైలు కింద పడి ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నారు. ఇందులో యువతి మెడలో ఉన్న ఐడీకార్డు ఆధారంగా నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని నిషిత డిగ్రీ కాలేజీలో బీఎస్సీ చదువుతున్న విద్యార్థిని చక్రవర్తుల నందిత(20)గా గుర్తించారు. యువకుడి మృతదేహం బాగా దెబ్బతినడంతో వివరాలు తెలియరాలేదు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.


రైల్వేట్రాక్‌పై పడి ఉన్న మృతదేహం